క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల తనిఖీ

రేగొండ: మండలంలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం రేగొండలో 180 మంది, రంగయ్యపల్లిలో 117 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండలంలోని పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ రవీందర్ రెడ్డి తనిఖీ చేశారు.

రేషన్‌కార్డు ఆప్షన్ తొలగించాలి

మొగుళ్లపల్లి: రాజీవ్ యువవికాసం దరఖాస్తుల్లో రేషన్ కార్డు ఆప్షన్ తొలగించాలని బీజేపీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సురేశ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యువవికాసం పేరిట ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతను ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. వైబ్‌సైట్‌లో రేషన్‌కార్డు ఆప్షన్ తొలగిస్తే లక్షలాది మందికి ఉపాధి అవకాశం ఉంటుందని తెలిపారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

మొగుళ్లపల్లి: ఐపీఎల్ క్రికెట్ సీజన్ ప్రారంభం అయిన సందర్భంగా యువత బెట్టింగ్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్సై బి.అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెట్టింగ్ చట్ట రీత్యా నేరమని, ఎవరైనా క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే సమాచారం ఇవ్వాలని కోరారు.

అందుబాటులో రాయితీ పనిముట్లు

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రాయితీతో కూడిన వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని ఏఓ శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. రోటోవేటర్లు 2, పవర్ స్ప్రేయర్లు 5, బ్యాటరీ స్ప్రేయర్లు 4, కల్టివేటర్లు 2 మండలానికి మంజూరైనట్లు తెలిపారు. కాగా ఈ సంవత్సరం పథకానికి మహిళా రైతులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ క్లస్టర్ పరిధిలోని ఏఈఓలకు పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌తోపాటు దరఖాస్తు ఫారం ఈనెల 26 లోపు అందజేయాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన విశ్రాంత మండల విద్యాధికారి పొలాల తిరుపతిరెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హనుమకొండలోని తన నివాసంలో ఉంటున్నాడు. ఈక్రమంలో సోమవారం ఆయనను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించి, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

రేగొండ: మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు తడక చంద్రస్వామి ఆదివారం రాత్రి తాటి చెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చంద్రస్వామిని మెరుగైన వైద్యం కోసం పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కల్లుగీత కార్మిక సంఘం నాయకులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో..

మండల కేంద్రంలోని జగ్గయ్యపేట రోడ్డులో సోమవారం జరిగిన ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన కట్ల కేతక్క ద్విచక్రవాహనంపై రేగొండకు వెళ్తుండగా వెనుక వైపు నుంచి ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. దీంతో కేతక్కకు తీవ్ర గాయాలు కాగా పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

దరఖాస్తు ఫారాలు అందించాలి

భూపాలపల్లి రూరల్: తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన మైనార్టీ క్రిష్టియన్ మహిళలకు 'ఇందిరమ్మ మహిళా శక్తి' పథకం కింద కుట్టు మిషన్లు అందించేందుకు గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఆయా దరఖాస్తు ఫారాలను ఈనెల 27న సాయంత్రం 5 గంటల వరకు జిల్లా సమీకృత కార్యాలయంలో మైనార్టీ సంక్షేమశాఖ అధికారి జిల్లా కార్యాలయంలో అందించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి శైలజ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు.

పలువురికి నోటీసులు

గణపురం: మండల కేంద్రంలో 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనుల నేపథ్యంలో సోమవారం గణపురం గ్రామపంచాయతీ అధికారులు పలువురికి నోటీసులు జారీచేశారు. తమ నోటీసు ఆధారంగా రోడ్డు వెడల్పులో ప్రధాన రహదారిపై ఇరువైపులా 50 ఫీట్లకు ఎక్కువగా ఉన్న భవనాల యజమానులు వెంటనే తొలగించాలని ఆ నోటీసులో హెచ్చరించారు.

నీటితొట్లు నిరుపయోగం

- దప్పికతో అల్లాడుతున్న మూగజీవాలు
- నిర్వహణను గాలికి వదిలేసిన అధికారులు
- ఉపయోగంలోకి తీసుకురావాలని పశుపోషకుల వేడుకోలు



నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి



శిథిలావస్థలో ఉన్న నీటితొట్టి

రేగొండ: వేసవిలో పశువుల దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో ఊరి బయట, పొలాలకు వెళ్లే ప్రధాన దారుల పక్కన ఏళ్ల కిందట నీటి తొట్లు నిర్మించారు. వాటి నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. ఉమ్మడి రేగొండ మండలంలో మొత్తం 37 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పశువుల దప్పికను తీర్చాలనే ఉద్దేశంతో గతంలో జాతీయ ఉపాధి పథకంలో ప్రభుత్వం అన్ని గ్రామాల్లో నీటితొట్లను నిర్మించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు వాటిని ఉపయోగించిన దాఖలు లేవు. దీంతో పశువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల కింది భాగంలో నిర్మించిన వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. నీటి సౌకర్యం లేని చోట అలానే వదిలేశారు. కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. వేసవిలో ఎండలు దంచికొట్టడంతో వాగులు, చెరువులు, కాలువలు పూర్తిగా ఎండిపోయాయి. తాగునీటి కోసం పశువులు గ్రామాల్లో అల్లాడుతున్నాయి. కొంత మంది రైతులు పశువుల దాహార్తి తీర్చేందుకు బోరు బావుల వద్ద నీటిని నిల్వ ఉంచి, పశువుల దాహార్తి తీర్చుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని, వేసవిలో మూగ జీవాల దాహార్తి తీర్చాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

అధికారులు దృష్టి సారించాలి

గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు అలంకారప్రాయంగా మారాయి. ఎండలు ప్రారంభం కావడంతో పశువులకు నీరు దొరకడం లేదు. గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నీటి సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. భూగర్భజలాలు అడుగంటడంతో చెరువులు, కుంటలలో కూడా నీరు లేవు. అధికారులు స్పందించి నీటి తొట్లను వినియోగంలోకి తీసుకురావాలి.

\- శ్రీనివాస్, రైతు

చెరువులు ఎండిపోయాయి

గ్రామాల్లోని చెరువులు, వాగులు ఎండిపోయాయి. పశువులు తాగేందుకు నీరు లేక ఇబ్బంది పడుతున్నాయి. నీరు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పశువులు దాహం తీర్చుకుంటున్నాయి. గ్రామంలో ఉన్న నీటితొట్లకు మరమ్మతులు చేయించాలి.

\- రాజయ్య, పశువుల కాపరి

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్ కుమార్

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలో సర్వే నంబర్ 280లో పేదలు వేసుకున్న ఇళ్లకు ఇందిరమ్మ పథకాన్ని అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక రావి నారాయణ రెడ్డి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు మూడు సంవత్సరాలుగా ఇళ్లు లేని పేదలు భగత్ సింగ్ కాలనీలో గుడిసెలు వేసుకొని నివాసముంటున్నారని తెలిపారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేసి రూ.5 లక్షలు అందించాలని కోరారు. అసెంబ్లీలో సైతం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గుడిసెవాసుల సమస్యలపై ప్రస్తావించారని తెలిపారు. భగత్ సింగ్‌కాలనీ వాసులకు ఇంటి నంబర్ రోడ్లు మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకుండా రాజీవ్ యువ కిరణాలకు గడువు తేదీ ప్రకటించడంతో చాలామంది నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు కొత్త పింఛన్లు అమలు చేయడంలో జాప్యం జరుగుతుందన్నారు. ఆరు గ్యారంటీ హామీలను త్వరగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, సుధాకర్ రెడ్డి, నేరెళ్ల జోసెఫ్, యాకుబ్ పాషా, కమలాకర్, రామకృష్ణ, కరుణాకర్, మహేష్ పాల్గొన్నారు.

ఎన్నిక



నాగరాజు, అధ్యక్షుడు

మొగుళ్లపల్లి: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన జెజిగం నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పవిత్రం శ్రీనివాస్, తనుకు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా గుండా భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా బజ్జూరి వీరన్న, కోశాధికారిగా వేణుగోపాల్, మండల యూత్ అధ్యక్షుడిగా పుల్లూరి సాయినాథ్, ప్రధాన కార్యదర్శిగా బజ్జూరి శ్రీనివాస్, కోశాధికారిగా దుగ్గిశెట్టి ప్రదీప్, కార్యదర్శిగా నారాయణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బజ్జూరి రాఘవులు, కోశాధికారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు బోనస్ డబ్బులు జమచేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కాటారం: రైతుల ఖాతాల్లో ప్రభుత్వం బోనస్ డబ్బులు జమ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ నాగరాజుకు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం బోనస్ డబ్బులు జమ చేయలేదని వెంటనే జమ చేయాలని కోరారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా డబ్బులు, కౌలు రైతులకు సంబంధించిన ఆర్థిక సాయం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొమ్మన భాస్కర్‌రెడ్డి, బొంతల రవి, ఆత్మకూరి స్వామియాదవ్, సదానందం, చీర్ల అశోక్ రెడ్డి, కోటన్న తదితరులు పాల్గొన్నారు.

'లాభాలకోసం టెండర్లు వేయొద్దు'

భూపాలపల్లి రూరల్: కోల్ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు లాభాలు ఆశించి టెండర్లు వేయొద్దని, కాకతీయ గని టిప్పర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పుట్ట రవీందర్, సబ్బని వెంకటేశ్వర్లు సోమవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. భూపాలపల్లి డివిజన్ నుంచి టిప్పర్స్ ద్వారా ఉప్పల్ రైల్వే సైడింగ్, రాగాపూర్ రైల్వే సైడింగ్, గోదావరిఖని సీఎస్‌పీలకు బొగ్గు రవాణా చేయడానికి 14 టైర్ల లారీలు, 16 టైర్ల లారీలకు ఫైనాన్స్‌తోపాటు డ్రైవర్ జీతాలు, ఇతర ఖర్చులకు సరిపోయే విధంగా టెండర్లు వేయాలని కోరారు. కాంట్రాక్టర్లు వారి లాభాలు మాత్రమే ఆలోచించకుండా, కాంట్రాక్టర్‌తోపాటు లారీ ఓనర్స్‌కు ప్రతిఫలం ఉండే విధంగా టెండర్లు వేసుకోవాలని కోరారు. భూపాలపల్లి కాకతీయ లారీ అసోసియేషన్ నుంచి 70శాతం లారీలు పెట్టుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లేదంటే భూనిర్వాసితులన తాము ఎట్టి పరిస్థితులలో ట్రాన్స్‌పోర్టును నడవనీయమని పేర్కొన్నారు.

మినార్ ధ్వంసం చేసిన ఇద్దరి అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో ఖబరస్తాన్ మేయిన్ గేటు రెండు మినార్లను మద్యం మత్తులో ధ్వంసం చేసిన ఘటనపై ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మహదేవపూర్ పోలీసుస్టేషన్‌లో సీఐ రామచందర్‌రావుతో కలిసి సోమవారం డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఆదివారం రాత్రి మహదేవపూర్‌లోని దుబ్బగూడెంలోని ఖబరస్తాన్ గేటుపైన రెండు మినార్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ముస్లిం మతపెద్దలు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో సీసీ కెమెరాలు, వాహనాల తనిఖీ, కాల్ డాటాల ఆధారంగా గంటల వ్యవధిలోనే సమాచారం సేకరించారు. దర్యాప్తులో మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ననుపూరి సాగర్ అలియాస్ సాయి, జోడు పవన్ అనే యువకులు మద్యం మత్తులో మినార్‌లను ధ్వంసం చేసినట్లు అంగీకరించారు. వారిని అరెస్టు చేసి రిమాండకు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసును ఛేదించిన మహదేవపూర్ సీఐ, మహదేవపూర్, కాళేశ్వరం, పలిమెల ఎస్సైలు పవన్‌కుమార్, తమాషారెడ్డి, రమేష్‌లను డీఎస్పీ అభినందిచారు.

మానవత్వం చాటిన హెడ్ కానిస్టేబుల్



విద్యార్థిని తీసుకెళ్తున్న వెంకటేశ్వర్‌రావు

టేకుమట్ల: తల్లిదండ్రులు నిరక్షరాస్యులు, విద్యార్థిని దృష్టిలోపంతో ఇబ్బంది పడుతుంది. ఈక్రమంలో సోమవారం పదో తరగతి పరీక్ష రాసేందుకు ఒక సెంటర్‌కు వెళ్లాల్సి ఉండగా.. మరో కేంద్రానికి వెళ్లింది. దీంతో ఓ కానిస్టేబుల్ తన వాహనంలో వెళ్లాల్సిన కేంద్రానికి చేర్చాడు. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన ఎలవేని రమ్య గత సంవత్సరం పదో తరగతిలో ఆంగ్లంలో ఫెయిల్ కాగా సప్లిమెంటరీ రాసేందుకు సిద్ధమైంది. ఈక్రమంలో భూపాలపల్లి పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి వెళ్లాల్సి ఉండగా.. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి చేరుకుంది. అప్పటికే ఉదయం 9గంటల సమయం కావచ్చింది. విషయం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ బెల్లంకొండ వెంకటేశ్వర్‌రావు తన కారులో భూపాలపల్లి పరీక్ష కేంద్రానికి సమయానికి చేర్చి పరీక్ష రాసే అవకాశాన్ని కల్పించారు. అంతే కాకుండా తిరుగు ప్రయాణ ఖర్చులకు రూ.400 సైతం అందించారు.

కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలి

వెంకటాపురం(కె): విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలోకి కోడి గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు సమ్మక్క మాట్లాడుతూ.. ధరలకు అనుగుణంగా కోడి గుడ్ల ధరను ప్రభుత్వం చెల్లించనందున ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేయాలని అన్నారు. మెనూ చార్జీలు విద్యార్థికి రూ.25 చెల్లించాలని డిమాండ్ చేశారు. వంట కార్మికులను తొలగించకుండా జీవో విడుదల చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులను చెల్లించాలని అన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- తహసీల్దార్ జాలి సునీత



ప్రజావాణిలో పాల్గొన్న మండల అధికారులు

మొగుళ్లపల్లి: మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజావాణిని నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జాలి సునీత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీత ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈరోజు రెండు వినతులు వచ్చాయని, ఒకటి విద్యుత్‌శాఖకు సంబంధించి కొత్త నియంత్రిక మంజూరుకు, మరొకటి ఆర్టీసీ బస్సు సేవలను పెంచాలని అర్జీలు ఇచ్చారని తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యల పరిష్కరం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివిధ మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ గాయత్రి

చిట్యాల: మండలంలోని జడలపేట గ్రామ శివారు భీష్మనగర్‌లో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం అంగన్‌వాడి టీచర్ సుజాత సమక్షంలో ఐసీడీఎస్, చైల్డ్ హెల్ప్ లైన్, మహిళా శక్తి, సఖి కేంద్రం సమన్వయంతో సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో మహిళలు, బాలికలు, ఎదుర్కొంటున్న సమస్యలు, బాల్యవివాహాలు, వరకట్న నిషేధం, దత్తత, మహిళలు, పిల్లల చట్టాలు, హక్కులు, టోల్ ఫ్రీ నంబర్ల గూర్చి, పిల్లల చదువు ప్రాముఖ్యత, ఉచిత హాస్టల్ సౌకర్యాలు, వివిధ వృత్తుల్లో శిక్షణ తరగతులపై వివరించారు. అలాగే మహిళలు, బాలికలు తీసుకోవాల్సిన ఆహార ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా శక్తి జిల్లా అధ్యక్షురాలు అనూష, మమత, చైల్డ్ హెల్ప్ లైన్ కళావతి, సఖి సెంటర్ కోఆర్డినేటర్ గాయత్రి, అంగన్‌వాడీ టీచర్స్ సుజాత, వసంత, సాధన, మమత, మహిళలు, కిశోర బాలికలు హాజరయ్యారు.

కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మల్హర్: మండలంలోని తాడిచర్లలో బొగ్గు సేకరణ పనులు చేపడుతున్న జెన్‌కో సంస్థ సీఎస్‌ఆర్ నిధుల ద్వారా మహిళలకు ఉచిత కుట్టు మిషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తాడిచర్ల గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు తాండ్ర మల్లేష్, తాండ్ర స్వరూపరాణి.. కలెక్టర్ రాహుల్ శర్మకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భూములు కోల్పోవడంతో ఉపాధి లేక చాలా కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయాయని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. జెన్‌కో సీఎస్‌ఆర్ నిధులతో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటుతోపాటు యువతకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇప్పించి, లైసెన్స్‌లు ఇప్పించాలని, వీధి కూడళ్లలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, కాపురం చెరువు కాలువలను సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మించాలని కోరినట్లు పేర్కొన్నారు. అలాగే పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్‌లోని ఇళ్లను సేకరించాలని అర్జీ సమర్పించినట్లు చెప్పారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు వెల్లడించారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ మౌనిక

కాటారం: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని కాటారం, మహాముత్తారం మండలాల్లోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి క్షయవ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి వివరించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వైద్యాధికారులు మాట్లాడుతూ క్షయ వ్యాధి అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, లక్షణాలతో క్షయ వ్యాధిని ముందస్తుగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాటారం, మహాముత్తారం మండల వైద్యాధికారులు మౌనిక, సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

హర్షణీయం.. కృతజ్ఞతలు



పాల్గొన్న రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు

భూపాలపల్లి రూరల్: గత ప్రభుత్వం 2020లో గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను రద్దు చేసినప్పటి నుంచి రాష్ట్రంలోని రైతులు నానా అవస్థలు పడుతున్న క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్తగా భూభారతి చట్టం అమల్లోకి తీసుకురావడం హర్షణీయమని భూపాలపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో (టీజీ ఆర్ఎస్ఏ) తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్, అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఇమామ్ బాబా, సయ్యద్ అజారుద్దీన్, రామస్వామి, డిప్యూటీ తహసీల్దార్ అంజలి, ఇనిగాల కృష్ణమూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంచాయక పథకం ఎక్కడ?

- కనుమరుగైన పొదుపు పథకం
- పట్టించుకోని అధికారులు
- గతంలో పలు పాఠశాలల్లో నిర్వహణ



వాజేడు ఉన్నత పాఠశాల

వాజేడు: విద్యార్థులకు చిన్నతనం నుంచే పొదుపును నేర్పించడంలో ఉపయోగపడే సంచాయక పథకం కనుమరుగైంది. డబ్బును ఎలా పొదుపు చేయాలి.. ఏ మేరకు ఖర్చు చేసుకోవాలి.. ఏ అవసరానికి ఎంత ఖర్చు చేయాలనే దానిపై సంచాయక పథకంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. పాఠశాలల్లో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షిస్తుంటారు. విద్యార్థులకు పొదుపుపై అవగాహన కల్పించడంతోపాటు, వారితో పొదుపుచేయించేలా ప్రోత్సహించే ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రస్తుతం ఎవరూ పట్టించుకోవడంలేదు. సుమారు 20 ఏళ్ల క్రితం వరకు కొనసాగిన ఈ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించి విద్యార్థులకు ఆర్థిక అవగాహన కల్పించాలని పలువురు విద్యావంతులు కోరుతున్నారు.

పొదుపుపై అవగాహన ముఖ్య ఉద్దేశం..

తల్లిదండ్రులు వారి పిల్లల జేబు ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బులను చిరుతిండ్లకు ఉపయోగిస్తున్నారు. దీంతో దుబారా ఖర్చుకు చిన్నప్పటి నుంచే అలవాటు పడ్డట్టు అవుతుంది. అయితే సంచాయక పథకం ద్వారా కావున పాఠశాలలో విద్యార్థులకు వారి తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బులను రూపాయి నుంచి ఎంతైనా కిడ్డీ బాక్స్‌లో వేసి రోజు వారీగా ఒక రిజిష్టర్‌లో నమోదు చేసేలా అవగాహన కల్పిస్తారు. సదరు విద్యార్థికి అత్యవసరమైతే రిజిస్టర్‌లో నమోదు చేసి కొంత ఇస్తారు. అవసరం లేని వారికి విద్యా సంవత్సరం పూర్తయిన తర్వాత వారు దాచుకున్న మొత్తం డబ్బులను పిల్లలకు అందిస్తారు. దీంతో వచ్చే సంవత్సరం మరికొంత మంది విద్యార్థులు డబ్బులను దాచుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఒకరిని చూసి ఒకరు డబ్బులను పొదుపు చేసుకోవడంపై దృష్టి కేంద్రీకరించేలా సన్నద్ధం చేయడం ఈ కార్యక్రమ ఉద్దేశం. కానీ, ఈ పథకం ప్రస్తుతం ఏఒక్క పాఠశాలలో కూడా అమలు కావడంలేదు. అయితే 13 ఏళ్ల క్రితం మండల కేంద్రంలోని నాగారం పాఠశాలలో సంచాయక పథకాన్ని నాడు పాఠశాలలో పని చేసిన నాగేశ్వరరావు, రాములు అనే ఉపాధ్యాయులు నిర్వహించినా.. వారి బదిలీ తర్వాత పట్టించుకునేవారు లేకుండాపోయారు.

పథకాన్ని కొనసాగించాలి



20 సంవత్సరాల క్రితం సంచాయక పథకం ఉండేది. నేడు దాని ఊసే లేదు. ఆ పథకం ఉన్న విషయమే అందరు మర్చిపోయారు. మళ్లీ ఆ పథకాన్ని కొనసాగిస్తే విద్యార్థులకు పొదుపుపై పట్టు దొరుకుతుంది.

\- స్వరూప్ సింగ్, హిందీ పండింట్, వాజేడు ఉన్నత పాఠశాల

ఉద్యమకారులకు అండగా నిలవాలి

- ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

కాటారం/కాళేశ్వరం: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం అండగా నిలిచి వారిని ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన యాత్ర సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 21న సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమ్మిరెడ్డి, కరుణాకర్‌రావు, సమ్మయ్య, సరస్వతి, దేవేందర్ పాల్గొన్నారు.